క్లుప్తంగా...

దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంసెట్ కౌన్సెలింగ్ అనంతరం ఏర్పడిన ఖాళీల నేపథ్యంలో చేపట్టిన స్పెషల్ ఫేజ్‌లో భాగంగా నిర్దిత గ్రూపుల్లో పరిమిత సంఖ్యలో ఉన్న సీట్లు భర్తీచేసే క్రమంలో విద్యార్థులు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. బీఎస్సీ బయాలాజికల్ సైన్స్ 97, ఫిజికల్ సైన్స్ 116, బీఎస్సీ గేమింగ్‌లో 39 సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 7 నుంచి 14 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేటి నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

రాంగోపాల్‌పేట్: నులి పురుగులను నివారించేందుకు ఈ నెల 3వ తేదీన అన్ని విద్యా సంస్థల్లో ఆల్బెండజోల్ మాత్రలను అందిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్నామని అంగన్వాడీ కేంద్రాల్లో 1 నుంచి 2 ఏళ్లలోపు పిల్లలకు సగం, 2 నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు పూర్తి మాత్రను చెంచాలో పొడిచేసి నీళ్లలో కలిపి అందించాలని సూచించారు. 3 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్ర నమిలి చప్పరించి మింగి నీళ్లు తాగాలన్నారు. ఆహారం తీసుకున్న తర్వాత మాత్రమే ఈ మాత్ర తీసుకోవాలని ఖాళీ కడుపుతో ఉన్నవారికి ఇవ్వకూడదన్నారు.

నర్సింగ్‌రావు సేవలు చిరస్మరణీయం



పద్మారావునగర్: నర్సింగ్‌రావు సేవలు చిరస్మణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం బోయిగూడలో ఏర్పాటు చేసిన నర్సింగ్‌రావు సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..కార్మిక, కర్షక వర్గాల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేసిన గొప్ప నాయకుడు నర్సింగ్‌రావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నరసింహారావు, సీపీఎం గ్రేటర్ కార్యదర్శి ఎం. శ్రీనివాస్, సీపీఎం నాయకులు పీఎస్ఎన్ మూర్తి, రఘుపాల్, సోమయ్య, ఐద్వా రాష్ట్ర నాయకురాలు ఆశలత, రమేష్, బీజేపీ నాయకులు టి. రాజశేఖరరెడ్డి, వై. సురేష్, ఆనంద్ యాదవ్, నర్సింగ్‌రావు తనయులు కె. సతీష్, రంజీత్ పాల్గొన్నారు.

ఆస్పత్రి ఏర్పాటుపై ప్రభుత్వం స్పందించాలి

లాలాపేట: మాణికేశ్వర్‌నగర్‌లో ప్రభుత్వ హాస్పిటల్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నాగులూరి సాయిబాబా డిమాండ్ చేశారు. మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. 121 రోజుల నుంచి దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. వచ్చేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహ, వేముల శ్రీనివాస్, కొండలు, ఓర్సు కృష్ణ, ఓర్సు శేఖర్, ఆలకుంట లింగయ్య పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కంటోన్మెంట్: ప్రభుత్వ పథకాల దరఖాస్తుల విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ నేత శ్రీగణేశ్ అన్నారు. ఈ నేపథ్యంలోనే శ్రీ గణేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ సేవలు ప్రారంభించామన్నారు. తొలిరోజు ఐదు చోట్ల ఏర్పాటు చేయగా, మిగతా ప్రాంతాల నుంచి కూడా వినతులు రావడంతో బుధవారం మరో ఐదు చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మారేడుపల్లి అంబేద్కర్‌నగర్, రసూల్‌పురా చంద్రనగర్, బోయిన్‌పల్లి నందమూరినగర్, సీతారాంపూర్, తిరుమలగిరిలోని న్యూ గాంధీ నగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత ఆన్‌లైన్ కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీజేపీని బలోపేతం చేస్తాం

అమీర్‌పేట: సనత్‌నగర్ నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని బలోపేతం చేస్తామని బీజేపీ జాతీయ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు విజయ అన్నారు. బుధవారం అమీర్‌పేట డివిజన్ ఎస్ఆర్‌నగర్‌లో పార్టీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిన అవసరముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు ఉమ, శ్రీనివాస్, ఉత్తమ్‌సింగ్, నవీన్‌గౌడ్, సాయి రాథోడ్, ఆనంద్, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఎస్‌ఏ అధ్యక్షుడిగా శశివర్ధన్

ఉస్మానియా యూనివర్సిటీ: అంబేడ్కర్ విద్యార్థి సంఘం (ఏఎస్‌ఏ) ఓయూ నూతన అధ్యక్షుడిగా శశివర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీలో జరిగిన సమావేశంలో పొలిటికల్ సైన్స్ విభాగానికి చెందిన ఆయనను ఎంపిక చేశారు. మహనీయుల ఆశయాలకు అనుకూలంగా సంఘ కార్యక్రమాలను కొనసాగిస్తానని ఈ సందర్భంగా శశివర్ధన్ పేర్కొన్నారు.

జీరా ఇళ్ల ఫ్రీహోల్డ్‌కు గ్రీన్ సిగ్నల్

- ఎన్నో ఏళ్ల ప్రజల నిరీక్షణకు లైన్ క్లియర్
- మంత్రి తలసాని చొరవతో ఇళ్ల క్రమబద్ధీకరణ
- 200 కుటుంబాలకు మేలు



జీరా ప్రాంతం

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని సుప్రసిద్ధమైన జీరా ఏరియా ఇళ్ల ఫ్రీహోల్డ్‌కు మార్గం సుగమమైంది. 816జీఓకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇక్కడ జీవిస్తున్న వందలాది కుటుంబాలకు వెసులుబాటు చేకూర్చినట్లయింది. ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడి ప్రజలు తమ ఇళ్లను ఫ్రీ హోల్డ్ చేయాలని కోరుతూ ఆందోళన చేస్తున్నారు. పలు ప్రభుత్వాలు, అధికారులకు దరఖాస్తు చేసుకుంటూ వస్తున్నారు. ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం వీరి డిమాండ్‌ను నెరవేర్చింది. స్థానిక ఎమ్మెల్యే మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకొని జీరా ఇళ్ల ఫ్రీహోల్డ్ సమస్యకు పరిష్కారం చూపారు. 134 ఇళ్లలో సుమారు 200 కుటుంబాలకు మేలు చేకూరనుంది.

ఫ్రీహోల్డ్‌తో..

తెలంగాణ ప్రభుత్వం ఇళ్ల క్రమబద్ధీకరణకు మార్గం సుగమం చేయడంతో ఇక్కడి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఫ్రీహోల్డ్‌తో ఇక్కడి ప్రజలు తమ ఇళ్లను తమకు నచ్చిన రీతిలో నిర్మాణాలు చేసుకోవడంతో పాటు వారసులకు ఆస్తిని బదిలీ చేయడానికి వీలవుతుంది. నామమాత్రపు రుసుంతో తమ ఇళ్లను ఫ్రీహోల్డ్ చేసుకునే వెసులుబాటును జీవో 816 ద్వారా ప్రభుత్వం కల్పించింది. విలువైన స్థలాలు ఇక్కడి ప్రజలకు దక్కే అవకాశం వచ్చింది.

జీరా ఫ్రీ హోల్డ్ సమస్య తీరుతెన్నులు..

సికింద్రాబాద్‌లోని జీరా ప్రాంతం 1934లో ఏర్పడింది. ఇక్కడి ప్రజలు ఓపెన్ యాక్షన్‌లో ఇళ్లను 99 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. అయితే 30 ఏళ్లకోసారి ఇళ్ల యజమానులు తమ ఇళ్లను రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. జీరాతో పాటు సికింద్రాబాద్‌లోని పలు ఏరియాల ప్రజలు తమ ఇళ్లను ఫ్రీహోల్డ్ చేయాలంటూ ఎన్నో ఏళ్లుగా ఆందోళనలు, విజ్ఞప్తులు చేస్తున్నారు. 1995లో జీఓ 816 ద్వారా సికింద్రాబాద్‌లోని 83 కాలనీలకు ఫ్రీహోల్డ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే కోర్టులో కేసు కారణంగా జీరా ప్రాంతానికి ఈ జీఓ వర్తించలేదు. అప్పటి నుంచి ఈ సమస్య నానుతూ వస్తోంది. అన్నీ ప్రాంతాలతో పాటు తమ నివాసిత ఏరియా స్థలాలను ఫ్రీ హోల్డ్ చేయాలని జీరా ప్రజలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు.

28 ఏళ్లుగా పోరాటం..

జీరా ప్రాంతానికి సంబంధించి నాటి స్థల యజమానులకు ప్రభుత్వానికి మధ్య కోర్టులో కేసు కొనసాగుతూ వస్తుంది. 2002లో సుప్రీం కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. 1995 నుంచి జీరా లీజ్ ల్యాండ్ ఓనర్స్ అసోసియేషన్ తమ ప్రాంతాన్ని ఫ్రీ హోల్డ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు పలు మార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నా ఈ సమస్యకు పరిష్కారం చూపలేకపోయారు. కోర్టు కేసు క్లియర్ అయి సుమారు 21 ఏళ్లు అయినా ఇక్కడి ప్రజలు సుమారు 28 సంవత్సరాల నుంచి పోరాడుతున్నా సమస్యకు పరిష్కారం లభించలేదు. జీరా లీజ్ ల్యాండ్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి తమ సమస్యను పరిష్కరించాలని మొర పెట్టుకున్నారు. దీంతో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపారు.

పోరాటానికి న్యాయం జరిగింది..



జీరా ప్రాంతం ఇళ్లను ఫ్రీహోల్డ్ చేయాలనే తమ పోరాటానికి న్యాయం జరిగింది. ఇందు కోసం సుమారు 28 సంవత్సరాల నుంచి తాము పోరాడుతున్నాం. ఎట్టకేలకు ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించింది. ఈ విషయంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేకంగా చొరవ తీసుకొని తమ సమస్యను పరిష్కరించారు.
-ఎం. చంద్రశేఖర్, జీరా లీజ్ ల్యాండ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు

ప్రభుత్వానికి ధన్యవాదాలు



తమ డిమాండ్‌ను నెరవేర్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాం. ఎన్నో సంవత్సరాల తమ కల నెరవేరినందుకు సంతోషం. మూడు తరాల నుంచి ఈ సమస్య కోసం ఎంతో మంది తమ ఏరియా పెద్దలు పోరాటం చేశారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఎన్నో కుటుంబాలు ప్రయోజనం పొందుతాయి.
-రామక్రిష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శి

అనేక కుటుంబాలకు మేలు..



జీరా ప్రాంత ప్రజల ఇళ్ల ఫ్రీహోల్డ్ సమస్య పరిష్కారానికి నోచుకుంది. ఎన్నో సంవత్సరాల నుంచి ఇక్కడి ప్రజలు తమ ఇళ్లను ఫ్రీహోల్డ్ చేయాలని కోరుతున్నారు. సమస్యను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించాలని కోరారు. జీవో 816ను అమలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం వల్ల అనేక కుటుంబాలకు మేలు జరిగింది. సమస్యలను పరిష్కరించి ప్రజలకు మేలు చేయాలనేది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం.
-తలసాని శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర మంత్రి

ఇది బీఆర్ఎస్ ఘనతే..

సనత్‌నగర్: నియోజకవర్గంలోని జీరా కాలనీ నివాసితుల కలను సాకారం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తలసాని అన్నారు. జీరా కాలనీలో లీజు స్థలంలో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న 134 ఇళ్ల స్థలాలను ఫ్రీ హోల్డ్ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ కాపీని బుధవారం కాలనీవాసులకు మంత్రి అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. జీరా కాలనీ స్థలాలను ఫ్రీ హోల్డ్ చేయాలని ఎన్నో ఏళ్లుగా గత ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కాలనీవాసుల సమస్యను అర్థం చేసుకుని జీఓ 816 ప్రకారం ఫ్రీ హోల్డ్ చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. కాలనీవాసులు మాట్లాడుతూ.. తమ స్థలాలను ఫ్రీ హోల్డ్ చేయాలని ఎన్నో ఏళ్లుగా ఎంతో మంది నాయకులతో మొర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో తమ కల నెరవేరిందన్నారు.



ఓయూలో రూ.16 కోట్లతో అప్రోచ్ రోడ్డు



అప్రోచ్ రోడ్డు మార్గాన్ని పరిశీలిస్తున్న వీసీ, ఎమ్మెల్యే

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో రూ.16 కోట్ల వ్యయంతో కొత్త అప్రోచ్ రోడ్డును నిర్మించనున్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఓయూ వీసీ ప్రొ.రవీందర్‌తో కలిసి అప్రోచ్ ఏర్పాటు రోడ్డు మార్గాలను పరిశీలించారు. అడిక్‌మెంట్ నుంచి విద్యానగర్ మీదుగా సుమారు 1.20 కిలోమీటర్లు కలుపుతూ అప్రోచ్ రోడ్డును ఆర్ట్స్ కాలేజీ రైల్వే స్టేషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్ వరకు ఏర్పాటు చేయనున్నారు. క్యాంపస్ నుంచి వాహనాల రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ పరంగా ఓయూకు అన్ని విధాలుగా సహకరిస్తామని ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషన్ రవికిరణ్, ఇంజనీరు అధికారులు రహీం, అనిల్‌రాజ్, స్వర్ణలత, తహసీల్దార్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి



రవీందర్‌గౌడ్‌ను కలిసిన బేగంపేట పాటిగడ్డ ముస్లిం మైనార్టీలు

సనత్‌నగర్: ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషిచేసే పార్టీ కాంగ్రెస్సేనని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. బేగంపేట పాటిగడ్డలో బుధవారం ఆయన పర్యటించగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రెసిడెన్షియల్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ఫయాజ్‌తో పాటు పలువురు నేతలు రవీందర్‌గౌడ్‌ను కలిసి మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలు రాజకీయ, సామాజిక, ఆర్థికంగా అభివృద్ధి చెందారంటే కాంగ్రెస్ హయాంలోనే అన్నారు. మళ్లీ కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో రంజాన్ అలీ అహ్మద్, అల్తాఫ్ వాజిద్, అస్లాం, మినజ్‌జాన్‌లతో పాటు కమల్‌రాజ్, రమేష్, శ్రీనివాస్‌గౌడ్, ఐవస్‌వాజ్ పాల్గొన్నారు.

కాలనీల్లో అధికారుల పర్యటన

అడ్డగుట్ట: డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు బీఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి నగర్, గోల్ బావి, గడ్డమీది బస్తీలలో పర్యటించి స్థానికంగా నెలకొని ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఈ సందర్భంగా స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అవసరమున్న అన్ని బస్తీల్లో నూతన రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు అతి త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జలమండలి డీజీఎం సరిత, సెక్షన్ మేనేజర్ నిఖితరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఏఈ వేణు, బీఆర్ఎస్ నేతలు లింగాని శ్రీను, సుధాకర్, శ్రీరాములు, వడ్లూరి రవి, గోపి, జోసెఫ్ పాల్గొన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణపై హర్షం

పద్మారావునగర్: ప్రభుత్వం ఇళ్ల ఫ్రీహోల్డ్‌పై తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం జీరా ప్రాంత వాసులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్న ఇళ్ల ఫ్రీహోల్డ్ సమస్యను రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పరిష్కరించారన్నారు. ఇళ్ల ఫ్రీహోల్డ్‌తో ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. శ్రీనివాస్ గౌడ్, రామక్రిష్ణ యాదవ్, నర్సింగ్‌రావు యాదవ్ పాల్గొన్నారు.

లక్ష్యాలతో ముందుకెళ్లాలి

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకెళ్లాలని పలువురు ప్రముఖులు సూచించారు. సెయింట్ మేరీస్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పీ.ఆంథోనీ, ఫార్ములా వన్ ట్రెనింగ్ కంపెనీ ఎండీ సుందర్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అంకితభావం, క్రమశిక్షణ సరైన సమయపాలన అనేది ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థిలో ప్రత్యేక శక్తి, సామర్థ్యాలు ఉంటాయని వాటిని సరైన రీతిలో ఉపయోగిస్తే విజయం ఖాయమన్నారు.

విలీనంతో బాధ్యత పెరిగింది

కంటోన్మెంట్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఉద్యోగులపై బాధ్యత మరింత పెరిగిందని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ డిపో ఆవరణలో బుధవారం నిర్వహించిన త్రైమాసిక పురస్కార మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంస్థ మనుగడ కోసం ఉద్యోగుల మరింత అంకితభావంతో పనిచేయాలన్నారు. ప్రయాణికులను మెప్పించే స్థాయిలో మెరుగైన రవాణా సౌకర్యాలు అందించాలన్నారు. ఈపీకే, కేఎంపీఎల్, వెహికిల్ కండిషన్ మెరుగుపర్చిన కండక్టర్, డ్రైవర్, మెకానిక్‌లకు ఈ సందర్భంగా నగదు బహుమతులు అందజేశారు. సికింద్రాబాద్ పర్సనల్ ఆఫీసర్ భాస్కర్ రెడ్డి ఆర్ఎం. ఖుస్రోషాఖాన్, డిప్యూటీ సీపీఎం వెంకట రెడ్డి, డిప్యూటీ ఆర్ఎంలు అపర్ణ, కళ్యాణి, కవిత, భీమ్‌రెడ్డి, కంటోన్మెంట్ డీఎం రామ్మోహన్ పాల్గొన్నారు.

విలీనం చరిత్రాత్మకం..

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం చరిత్రాత్మకమని బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులతో కలిసి స్వీట్లు పంచి, టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ చారిత్రక నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. తాము ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందుతున్నందుకు సంతోషంగా ఉందని కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈడీ, డిపో మేనేజర్, డ్రైవర్లు, కండక్టర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రావుల సతీష్, నగేష్ యాదవ్, యాదగిరి, శివ, ప్రవీణ్, నర్సింహ పాల్గొన్నారు.



స్వీట్లు పంచిపెడుతున్న గజ్జెల నాగేశ్

ఇద్దరు బైక్ దొంగల రిమాండ్

అడ్డగుట్ట: బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దయాకర్ వివరాల ప్రకారం.. ముషీరాబాద్‌కు చెందిన సోహెల్ (20), ఫయాజ్ (20 స్నేహితులు. గతంలో సోహెల్ మెకానిక్‌గా పని చేస్తున్నప్పుడు బైక్‌ల తాళాలు తీయడం నేర్చుకున్నాడు. ఫయాజ్ స్క్రాప్ షాప్‌లో పనిచేస్తాడు. వీరిద్దరూ గత కొంతకాలంగా బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ముషీరాబాద్, కుషాయిగూడ, గాంధీనగర్, తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు బైక్‌ల దొంగిలించారు. బుధవారం టాస్క్‌ఫోర్స్, తుకారాంగేట్ పోలీసులు, ఇతర పోలీసు బృందం సోహెల్, ఫయాజ్‌ను ముషీరాబాద్‌లో అదుపులోకి తీసుకుని 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.


వేర్వేరు ఘటనల్లో ఉరేసుకుని ఇద్దరు ఆత్మహత్య

అమీర్‌పేట: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామప్రసాదరావు వివరాల ప్రకారం.. అమీర్‌పేట కుమ్మరి బస్తీకి చెందిన ఓ బాలిక (16) మెదక్‌లోకి గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. కడుపు నొప్పితో బాధపడుతున్న బాలికను తల్లి ఇంటికి తీసుకువచ్చి చికిత్స చేయించింది. వర్షాల కారణంగా సెలవు ఉండటంతో ఇంటి వద్దనే ఉంటోంది. మంగళవారం తల్లికి పాఠశాల నుంచి ఫోన్ చేసి బాలికను తీసుకురావాలని చెప్పడంతో ఆ విషయాన్ని కూతురుకు తెలిపింది. అదే రోజు సాయంత్రం బాలిక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మరో ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..

బల్కంపేటకు చెందిన ఎల్లంకి రమేష్‌కుమార్‌గౌడ్ (38) కాగ్నిజంట్ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. 2017లో వివాహం జరగగా మనస్పర్థల కారణంగా భార్య 2021లో విడాకులు తీసుకుని వెళ్లిపోయింది.అప్పటి నుండి రమేష్‌గౌడ్ మానసికంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

భార్యను చంపిన వృద్ధుడికి పదేళ్ల జైలు



వెంకటేశ్

కంటోన్మెంట్: భార్యను చంపిన కేసులో ఓ వృద్ధుడికి పదేళ్ల జైలు శిక్ష పడిన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీఓ కార్యాలయంలో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేసి రిటైర్డ్ అయిన జి. వెంకటేశ్ (72) భార్య సుమతి (66) కుటుంబ సభ్యులతో కలిసి బాపూజీనగర్ మలానీలో నివసిస్తున్నాడు. రిటైర్మెంట్ తర్వాత కొన్నాళ్లకు వెంకటేశ్ విచిత్రంగా ప్రవర్తిస్తూ కుటుంబ సభ్యులను వేధించేవాడు. గత ఫిబ్రవరి 19న విచిత్రంగా ప్రవర్తిస్తూ ట్యాబ్లెట్స్ కావాలని కుటుంబ సభ్యులను వేధించాడు. కాసేపటికి కుటుంబ సభ్యులు ఎవరి గదుల్లోకి వారు వెళ్లిపోయారు. సుమతి మాత్రం హాల్‌లోని సోఫాలో నిద్రపోయింది. అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో హాల్ నుంచి శబ్దం రావడంతో కుమారుడు రామకృష్ణ వచ్చి సోఫాలో పడుకున్న తల్లిని లేపేందుకు ప్రయత్నించగా కూలపడిపోయింది. ఆమెకు రక్త గాయాలు అయినట్లు గుర్తించాడు. ఆమె తలపై గాయాలతో పాటు కుడిచేతి చూపుడు వేలు తెగి ఉండటాన్ని గమనించాడు. తన భార్యపై కర్రతో దాడి చేసినట్లు వెంకటేశ్ అంగీకరించాడు. బాధితురాలిని 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించగా వారం చికిత్స అనంతరం మృతి చెందింది. కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బోయిన్‌పల్లి పోలీసులు వెంకటేష్‌ను రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై హత్య, గృహహింస కేసులు నమోదు చేయగా, కేసును విచారించిన ఆరో అదనపు మెట్రో సెషన్స్ కోర్టు జడ్జి నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధించారు.

'డబుల్' ఇళ్ల కేటాయింపులో ప్రభుత్వం విఫలం



లాల్‌బజార్‌లో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

రసూల్‌పురా: అర్హులైన పేదలందరికి డబుల్ బెడ్రూమ్ ఇవ్వడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరశురాం విమర్శించారు. బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గం ఏడో వార్డు లాల్‌బజార్, శాస్త్రీనగర్, సెంట్రల్ బజ్రీ బస్తీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పరశురాం మాట్లాడుతూ.. మురికివాడలు లేని నగరంగా మార్చాలని చేపట్టిన పథకం లక్ష్యాలను చేరలేదని లక్ష ఇళ్లు ఇస్తామని హామీచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. పేదలకు డబుల్ బెడ్రూమ్‌లు కేటాయించాలని ఈ నెల 5న ఇందిరాపార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ ముదిరాజ్, అశోక్, ప్రశాంత్, నర్సింగ్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. మేరకు బుధవారం శాంతినగర్‌లోని కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య పాల్గొని మాట్లాడారు. ప్రసవం అయిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు ఎంతో బలవర్ధక ఆహారం అని అవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయన్నారు. పాలు ఇవ్వడంతో బ్రెస్ట్ కేన్సర్ రాకుండా జాగ్రత్త పడొచ్చని పేర్కొన్నారు. ప్రసవానికి ఆస్పత్రికి వెళ్లేందుకు 108 సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రసవం అనంతరం శిశువుకు పాలు ఇచ్చే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ చంద్రమణి, బస్తీ మహిళలు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ తార్నాక అధ్యక్షుడు మణికుమార్ మృతి




మణికుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అంజన్‌కుమార్ యాదవ్

లాలాపేట: తార్నాక డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. మణికుమార్ (చిన్న) (50) గుండెపోటుతో మంగళవారం రాత్రి గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. గత కొన్ని రోజుల క్రితం గుండెపోటు రావడంతో గాంధీ హాస్పిటల్‌లో చేరారు. బుధవారం లాలాపేటలోని ఆయన నివాసంలో మణికుమార్ మృతదేహం వద్ద మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, డీసీసీ అధ్యక్షులు అనీల్‌కుమార్, వివిధ పార్టీల నాయకులు నాయకులు నాగులూరి సాయిబాబా, నోము ప్రకాష్‌రావు, బండా చంద్రారెడ్డి, గణేష్ ముదిరాజ్, వీరన్న, సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, నాగరాజు గౌడ్, కిషన్ శర్మ నివాళి అర్పించారు.

వామ్మో.. పాములు



ఆరడుగుల పామును పట్టుకున్న దృశ్యం



శాంతినగర్‌లో ఓ ఇంటి ముందు ప్రత్యక్షమైన నాగుపాము పిల్ల

అడ్డగుట్ట: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు డ్రైనేజీలు, నాలాలు పొంగి పొర్లి నగర వాసులందరూ ఇబ్బందులు పడ్డారు. అయితే.. ఈ క్రమంలో వరదనీటితో కొట్టుకు వచ్చిన ఓ నాగు పాము పిల్ల బుధవారం శాంతినగర్‌లోని ఓ ఇంటి వద్ద ప్రత్యక్షమై కలకలం రేపింది. గుర్తించిన స్థానికుల ఫ్రెండ్ ఆఫ్ స్నేక్ బృందానికి సమాచారమివ్వగా ఘటనా స్థలానికి చేరుకుని పాము పిల్లను పట్టుకుని తీసుకెళ్లారు.

మొండిబండా నగర్‌లో..

అడ్డగుట్టలోని మొండిబండ నగర్‌లో బుధవారం ఆరు అడుగుల పాము కనిపించింది. దీంతో స్థానిక గుడిసె వాసులు భయాందోళనతో ఉరుకులు పరుగులు పెట్టారు. అనంతరం స్థానికంగా ఉన్నటువంటి ఓ వ్యక్తి ఆ పామును పట్టుకున్నాడు. బస్తీలో సంచరిస్తున్న పాముల బారి నుంచి తమను రక్షించాలని మొండిబండ నగర్ వాసులు వేడుకుంటున్నారు.

తైక్వాండోలో సత్తా



కాంస్యం సాధించిన నాగసాయి ఆరుష్

సనత్‌నగర్: ఉత్తరప్రదేశ్ లక్నోలోని సింగ్‌బాబు స్టేడియంలో ఇటీవల జరిగిన ఆరో నేషనల్ క్యాడెట్ క్యోరుగి అండ్ పూమ్‌సే తైక్వాండో చాంపియన్‌షిప్-2023లో సనత్‌నగర్‌కు చెందిన నాగసాయి ఆరుష్ మూడో స్థానాన్ని కైవసం చేసుకుని కాంస్య పతకాన్ని సాధించింది. బుధవారం మాస్టర్లు ప్రవీణ్‌కుమార్, కిషోర్‌కుమార్, కోచ్ మధుసూదన్ ఆమెను ప్రశంసించారు.

మర్యాదపూర్వక కలయిక



సాక్షి, సిటీబ్యూరో: బేగంపేట్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన జుట్టు భాస్కర్‌ను బుధవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గౌరపల్లి రమేష్ ఆధ్వర్యంలో బేగంపేట కాంగ్రెస్ నాయకులు జోహన్, దయానంద్, సాంబయ్య లడ్డు, క్రాంతి, భరత్, నరేష్, బాల్‌రాజ్, రాజు, సురేష్, రాబర్ట్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన జీహెచ్‌ఎంసీ ఏసీపీ..



శ్రీలతా శోభన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రజిత

లాలాపేట: సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రజిత బుధవారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డిని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో మోతె శోభన్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారులు సరిత, ప్రకాష్ పాల్గొన్నారు.